

కాఫీ దిగుబడులపై అవగాహన

ప్రజాశక్తి-జి.మాడుగుల: ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ ప్రకృతి వ్యవసాయ శాఖ రైతు సాధికారిక సంస్థ, ఉత్పత్తి దారుల మార్క్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మండలం లో పలు గ్రామాలలో ఆదివారం కాఫీ పంట రైతులకు అధిక దిగుబడి, అధిక ఆదాయంపై అవగాహన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమానికి స్టేట్ ఆర్‌పిసి కృష్ణారావు ,జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ భాస్కర్, ఎప్‌పిఒ సిఇఒ గంగరాజు, ఇంటర్నేషనల్ కాఫీ ఎక్స్పర్ట్ ట్రైనర్ సునీత, అమీత్ మండల కాఫీ ఎంటి రామలింగం పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి

-యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్- ఘనంగా స్వర్ణోత్సవ జిల్లా సభలు



ర్యాలీ చేపడుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) స్వర్ణోత్సవ అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన మహాసభ ఆదివారం అరకులోయలోని షేక్ సాబ్జీ ప్రాంగణం, ఏపీ టూరిజం గోష్టిలో ప్రారంభమ య్యాయి. అనంతరం గోష్టి ఆడిటోరియం నుంచి ఆర్టిసి కాంప్లెక్స్ వరకు భారీ ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం యుటిఎఫ్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ ఎస్ ప్రసాద్ హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న టిడిపి ప్రభుత్వం విద్యారంగంలో కొత్త మార్పులు తీసుకొస్తామని పాత ప్రభుత్వం చేసిన తప్పులను సవరిస్తామని చెప్తుందని కానీ రెండు ప్రభుత్వాలు ఒకే బాటలో నడుస్తున్న పరిస్థితి ఉందన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఉద్యోగులకు ఉపాధ్యాయులకు 25 కోట్లు రూపాయలు బకాయి ఉన్నాయని,. కానీ ఒక్క రూపాయి కూడా చెల్లించిన దాఖలు లేదన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్సి సంబంధించి గత ప్రభుత్వం హయాంలో కమిషన్ ఏర్పాటు చేశాని, ఒక్క అడుగు కూడా ముందు వేసిన ధాఖలు లేదన్నారు. 12వ పిఆర్సి అమలుకు కమిషన్ నియమించి పిఆర్సి అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు జులై 23 నుంచి జీతాలు పెంచవలసి ఉందని, ప్రస్తుతం పెంపుదల ధరలు పెరుగుదల దృష్టిలో పెట్టుకొని 29శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించకుండా కాలవ్యాపన చేస్తే పోరాటంతో ముందుకు సాగించవలసి ఉంటుందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలను ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంచి సంస్కరణలను మారుస్తామని ఇంతవరకు అమలు చేయలేదన్నారు. జీవో 117 రద్దు చేయకపోగా విద్యారంగంలో ఉపాధ్యాయులకు తీవ్ర ఒత్తిడి గురి చేసి బోధనలతో పాటు అనేక పనులను చేయిస్తున్న పరిస్థితి ఉందని అన్నారు. యాప్‌లను రద్దు చేయలేదని తెలిపారు .ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని విద్యారంగ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ప్రభుత్వం తక్షణం బకాయిలు చెల్లించాలని, లేకుంటే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి తప్పక పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ పూర్వ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు కె.విజయ గౌరి,ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శి పి దేముడు, జిల్లా గౌరవధ్యక్షుడు టి.చిట్టిబాబు, జిల్లా కార్యదర్శి పి.కృష్ణయ్య, జిల్లా ఎడిట్ కమిటి సభ్యులు కె.రఘునాథ్, జిల్లా కార్యదర్శి ధర్మారావు, సీనియర్ నాయకులు ఎస్.రాంబాబు, వివి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్


మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

పోలవరం నిర్వాసితులపై ద్వంద్వ వైఖరి సరికాదు

- సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్

ప్రజాశక్తి-కూనవరం : పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి సరికాదని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని మార్త శ్రీరామ్మూర్తి భవనంలో ఆదివారం జరిగిన సిపిఎం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని కూనవరం, టేకులబోరు గ్రామాలకు పోలవరం ఇంటి వాల్యుయేషన్ వేసి నష్ట పరిహారాన్ని ప్రకటించాలని చూస్తున్న ప్రభుత్వం నిర్వాసిత కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని వారి స్థిరాస్తి అయిన గృహాలకు 2013 భూ సేకరణ చట్ట ప్రకారం వన్ ప్లస్ ఫోర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సర్వస్వం కోల్పోతున్న ప్రజలపై ప్రభుత్వాల ద్వంద్వ వైఖరి విడనాడి నిర్వాసితులకు అండగా నిలవాలని సూచించారు. పోడియం రామారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుల మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు పాయం సత్యనారాయణ, బాబు బొర్రయ్య, కర్నాటి శ్రీనివాసరావు, తాళ్లూరు శ్రీనివాసరావు, ఆవుల మురళి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తాగునీటి పథకాలు మంజూరు

ప్రజాశక్తితో గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జవహర్ కుమార్

ప్రజాశక్తి - పాడేరు: జల జీవన్ మిషన్ కింద జిల్లాలో రిజర్వాయర్లు, నదుల ఆధారంగా సమగ్ర తాగునీటి పథకాలు చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని గ్రామీణ నీటి సరఫరా శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జవహర్ కుమార్ వెల్లడించారు. జిల్లాలో కొత్తగా చేపట్టనున్న తాగునీటి పనులకు సంబంధించి ప్రజాశక్తికి ఇంటర్వ్యూలో వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే...

జిల్లాకు మంజూరైన తాగునీటి పనులు ఎన్ని?

-అల్లూరి జిల్లాకు 7,135 తాగునీటి పనులను ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసింది. రంపచోడవరం, పాడేరు డివిజన్లోని 22 మండలాల్లో వార్షిక కార్యాచరణ ప్రణాళిక కింద 4,547 పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రభుత్వం ఎంత మంజూరు చేసింది?

జిల్లా వ్యాప్తంగా 22 మండలాల్లో తాగునీటి పథకాలు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.183 కోట్లు మంజూరు చేసింది. ప్రస్తుతం వచ్చే నాలుగు నెలల బడ్జెట్ కింద 40 కోట్లు కేటాయించింది. వీటితో జిల్లాలో మార్చి నాటికి కొన్ని తాగునీటి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం..

ఇంటింటికి కుళాయిలు ఎన్ని కల్పించారు?

-ఇప్పటివరకు జిల్లాలో 94 వేల 929 గృహాలకు ఇంటింటికి కుళాయిల అందించాం. జిల్లాలో 1,18,463 గృహ సముదాయాలు ఉన్నాయి. ఇంకా ఈ మార్చి నాటికి 25 వేల 534 గృహాలకు ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు పనులు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇంకా ఇంటింటికి కుళాయిలు కల్పించేందుకు పల్స్ సర్వే నిర్వహిస్తున్నాం. గృహ సముదాయాలు 10 శాతం వరకు పెరిగాయి. వీటన్నింటికీ కూడా కుళాయిలు సౌకర్యం కల్పించడానికి ప్రతిపాదనలు చేస్తాం.



భారీ తాగునీటి ప్రాజెక్టులకు చర్యలేమిటి?

జిల్లాలోని జనాభా ఎక్కువ కలిగిన చింతపల్లి, అరకు, రంపచోడవరం, పాడేరు వంటి ప్రధాన కేంద్రాల్లో పెద్ద తాగునీటి చేపట్టడానికి సర్వే నిర్వహిస్తున్నాం డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్‌తో ప్రభుత్వానికి ప్రతిపాదించనున్నాం.




బీటీ రోడ్డు మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న పెద్ద గొయ్యి

ప్రమాదభరితంగా గింజంగి బిటి రోడ్డు

- రహదారి మధ్యలో పెద్ద గొయ్యి

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ కేంద్రం నుండి వనబలింగం, గింజంగి గ్రామాలకు వెళ్లే బిటి రోడ్డుకు మధ్యలో పెద్ద గోయ్యి ఏర్పడడంతో ప్రమాదభరితంగా మారింది. జీకే వీధి నుంచి మొండిగడ్డ వరకు బస్సులో వెళ్లి అక్కడ నుంచి వనబపలింగం, గింజంగి గ్రామస్తులు కాలినడకన, దిచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. కొన్ని రోజులుగా బీటీ రోడ్డు ప్రమాదభరితంగా గొయ్య ఏర్పడడంతో వాహన చోదకులు బిక్కుబిక్కు మంటూ ప్రయాణం కొనసాగిస్తున్నారు. ప్రమాదవశాత్తు ఆ గోతిలో పడితే పెను ప్రమాదం సంభవిస్తుందని ఆందోళన గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమతు పనులు చేపట్టాలని, గోయ్యిని పూడ్చాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

తుపాన్ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి : తుఫాను నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మారేడుమిల్లి సిఐ సిహెచ్.గోపాలకృష్ణ సూచించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలు పడి వాగులు పొంగి ప్రమాదం ఉందని, ఆ సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు దాటవద్దని, అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని హితవుపలికారు. అత్యవసర సమయాల్లో స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.


సిఐ గోపాలకృష్ణ


మాట్లాడుతున్న పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె విజయ గౌరి

జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలి

-పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయ గౌరీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ఏజెన్సీ ప్రాంతంలో జీవో 3 రద్దు చేయడంతో నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగిందని తక్షణమే పునరుద్ధరణ చేసి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉత్తరాంధ్ర పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కె విజయ గౌరీ కోరారు. ఆదివారం అరకులోయలోని ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో 600 మంది విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలలో కేవలం 14 మంది ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారని అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏఎన్ఎంలు లేక సరైన వైద్యం అందక రోజురోజుకు విద్యార్థుల మరణాలు సంఖ్య పెరుగుతున్నా ప్రభుత్వం కనీసం స్పందించ లేదన్నారు. వసతి గృహాల్లో పూర్తి స్థాయిలో వంట కుక్కులు, కమాటీలు, వార్డెన్లు లేరని, ఇటువంటిటప్పుడు పౌష్టికారం ఎలా అందుతాయని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఆర్థికపరంగా రావలసిన బకాయిలు నేటికి చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఎన్నో ఏళ్లుగా గురుకులంలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల పోస్టులను డీఎస్సీలో చూపడంతో 1600 మంది రోడ్లపై పడి 14 రోజులుగా పోరాటం చేస్తున్నా కనీసం ప్రభుత్వం స్పందించ లేదని విమర్శించారు. గురుకుల ఉపాధ్యాయులు పోరాటంలో ఉంటే ఏపీ టీడబ్ల్యూ పాఠశాల నుంచి డిప్యూటేషన్ వేయడానికి ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. గురుకుల ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటానికి పిడిఎఫ్ తరపున పూర్తిగా మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికైనా గురుకులం ఉద్యోగస్తులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరు తనకు ఓటు వేసి గెలిపించి చట్టసభలో పంపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి పి.దేముడు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు కె.రఘునాథ్ పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి- పెదబయలు: అరకు వ్యాలి మండలం ఎండపల్లి వలస గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థిని జన్ని ప్రియాంక మృతి చెందటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుతో బాధపడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కిల్లో సర బన్న, బొండ గంగాధరం, జంపరంగి సునీల్ కుమార్, ఆదివాసి గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు బొండా సన్నిబాబు కోరారు. విలేకరులతో వారు మాట్లాడుతూ, జన్ని ప్రియాంక కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని, ఆ కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. రోజురోజుకు గిరిజన ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహల్లో విద్యార్థులు చనిపోతున్నా సంబంధిత అధికారులు, ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ఇప్పటివరకు స్పందించిన పరిస్థితి కనిపించ లేదన్నారు. గిరిజన విద్యార్థిని విద్యార్థులంటే ప్రభుత్వ యంత్రాంగానికి చిన్నచూపుగా ఉందని, పాలక ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదన్నారు.

తుపాన్ హెచ్చరికలు పర్యాటక బోట్లుకు వర్తించవా?

పాపికొండల విహారయాత్రకు వెళ్లిన టూరిస్టు బోట్లు

ప్రజాశక్తి-దేవీపట్నం

బంగాళాఖాథంలో ఏర్పడిన తుపాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమై పలు చోట్ల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. వాగులు పొంగే ప్రమాదం ఉందని, అత్యవసరమైతే తప్ప వాగులు దాటి రావొద్దని పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే పర్యాటక ప్రాంతాల వైపు మాత్రం అధికారులు దృష్టి సారించలేదు. తుపాన్ హెచ్చరికలు పాపికొండలు వెళ్లే పర్యాటక బోట్లుకు వర్తించవా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

పాపికొండలు విహార యాత్రకు టూరిస్టులతో గోదావరి నదిలో పర్యాటక బోట్లు దర్జాగా వెళుతున్నాయి. గత రెండు రోజుల నుంచి తుఫాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. అయినా ఆదివారం దేవీపట్నం మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న బోట్ పాయింట్ నుంచి పాపికొండలు విహారయాత్రకు పర్యాటక బోట్లు వెళ్లాయి. ఆరు బోట్లలో 330 మంది పర్యాటకులు విహారయాత్రకు వెళ్లారు. ఒకపక్క వర్షాలు కురుస్తున్నా గోదావరి నదిలో బోట్లు ప్రయాణించడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కచ్చులూరు గ్రామ సమీపంలో జరిగిన సంఘటనను మళ్ళీ గుర్తు చేసుకుంటున్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు, గోదావరి నదికి వరదలు వచ్చే సమయంలోనూ పాపికొండల విహారయాత్రను తాత్కాలికంగా రద్దు చేస్తే మంచిదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఊహించని ప్రమాదం ఏదైనా జరిగితే మరోసారి భారీ నష్టాన్ని చవి చూడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి విషయాలపై జిల్లాస్థాయి అధికారులు ఒక్కసారి ఆలోచించి సరైన నిర్ణయాలు తీసుకుంటే మంచిదని అంటున్నారు.


పాపికొండలకు బయలుదేరిన పర్యాటక బోటు

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు



పాడేరులో ర్యాలీని ప్రారంభించిన డిఎం అండ్ హెచ్ ఓ జమాల్ బాషా


ప్రజాశక్తి-పాడేరు

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో ఆదివారం ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం ఆధ్వర్యంలో మినుములూరు వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జమాల్ భాషా ర్యాలీని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హెచ్ఐవి ప్రాథమికంగా అసురక్షిత రక్త మార్పిడి ద్వారా సంక్రమిస్తుందన్నారు. అసురక్షిత సెక్స్, వ్యాధి సోకిన వ్యక్తితో సూదులు లేదా సిరంజిలను పంచుకోవడం, సోకిన వ్యక్తి నుండి రక్తమార్పిడి లేదా అవయవ మార్పిడిని స్వీకరించడం, పచ్చ బొట్టు పొడిపించుకొనుట, ప్రసవ సమయంలో తల్లి నుండి బిడ్డకు హెచ్ ఐ వి వ్యాప్తి చెందుతుందన్నారు. గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో క్విజ్, ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలను బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ గౌరి శంఖర్, ఆరోగ్య విస్తరణ అధికారి గుల్లేలి సింహాద్రి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ రామచందర్, డి.యం.డి.ఓ చిరంజీవి, ఐ.సి.టి.సి కౌన్సిలర్ మధు కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ అన్నపూర్ణ, క్షయ పర్యవేక్షకులు కె సదానందం పాల్గొన్నారు.


చింతూరులో మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రత్నమాణిక్యం

చింతూరు : ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి, నినాదాలు చేస్తూ చింతూరు మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం మాట్లాడుతూ ఎయిడ్స రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కషి చేయాలని సూచించారు. హెచ్ఐవి సోకిన వారి పట్ల ఎటువంటి వివక్ష చూపకుండా ఆదరించాలన్నారు. వివాహేతర సంబంధాలు, వాడిన సూదులు, సిరంజీలు వాడటం, వ్యాధిగ్రస్తుని నుండి రక్త మార్పిడి ద్వారా ఎక్కువగా హెచ్ఐవి వ్యాపిస్తుందని చెప్పారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని, అందువల్ల యువత అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జి.వెంకట్రావు, డి.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ జి.సాయికుమార్, జి.హారతి, కె.శైలజ, కె.శ్రీదేవి, బి.సంగం నాయుడు, వి.శీనయ్య, వి.సుబ్బారావు, కన్నయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్డతీగల : మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఆదివారం వైద్యధికారి డాక్టర్ పండా సతీష్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ మార్గాలను మెడికల్ ఆఫీసర్ తెలియజేశారు. ఎవరైనా వ్యాధి ఉందని భావిస్తే హాస్పిటల్‌కి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, అటువంటి వారి సమాచారం గోప్యంగా ఉంచడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు, వైద్యులు డాక్టర్ ప్రసన్న కుమారి, హెడ్ సిస్టర్ నాగమణి, సునీత వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అడ్డతీగలలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ డే ర్యాలీ నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది భద్రకాళి, పున్నమ్మ, మంగ, పవన్, పోచమ్మ, చంద్రమ్మ పార్వతి, శ్రీనివాస్, సత్యనారాయణ, రామారావు, మీనా, శాంతి, ప్రియాంక, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



విఆర్.పురం మండలం రేఖపల్లిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గురుకుల టీచర్ల సమస్యలు పరిష్కరించాలి


నిరసన దీక్షలో కూర్చున్న గురుకుల ఉద్యోగులు

ప్రజాశక్తి-పాడేరుటౌన్:జిల్లాలోని గిరిజన గురుకుల ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమ సమస్యలను పరిష్కరించాలని పాడేరులో ఆదివారం నిరసనను కొనసాగించారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డిఎస్ సి కారణంగా వారి ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడింది. ఈ విషయమై తమకు న్యాయం చేయాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని గురుకుల పాఠశాలల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఈనెల 16వ తేదీ నుంచి పాడేరు ఐటిడిఏ ఎదుట నిరసన ధర్నా నిర్వహిస్తున్నారు.

రోడ్డున పడనున్న కుటుంబాలు

రాష్ట్రవ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో సుమారు 1650 మంది దాదాపు 10 నుంచి 15 ఏళ్లగా చాలీచాలని జీతాలతో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. అల్లూరి జిల్లాలో పాడేరు ఐటిడిఎ పరిధిలో 9 గురుకుల పాఠశాలలు, 10 కళాశాలలు, చింతూరు, రంపచోడవరం ఐటిడిఎల పరిధిలో 7 గురుకుల పాఠశాలలు,7 కళాశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు మొత్తం 510 మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మెగా డిఎస్ సి ప్రకటించడంతో తమ ఉద్యోగాలు పోతాయని తాము వీధిన పడతామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెగా డిఎస్ సిలో గిరిజన ప్రాంతాల్లోని గురుకుల విద్యాలయాలకు సంబంధించిన 1,143 పోస్టులు ప్రతిపాదించారు. దీంతో ఏళ్ల తరబడి ఔట్ సోర్సింగ్ పద్ధతిలో సేవలందిస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందుతున్నారు. పాడేరు ఐటిడిఏ పరిధిలోని గురుకులాల్లో సుమారు 280 మంది, చింతూరు, రంపచోడవరం ఐటిడిఎల పరిధిలో సుమారు 230 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. దీంతో అల్లూరి జిల్లా వ్యాప్తంగా గురుకుల విద్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు 510 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విధులను బహిష్కరించి ఆందోళన బాట పట్టారు. తక్షణం తమను క్రమబద్ధీకరించాలని, కనీసం కాంట్రాక్ట్ రెసిడెంట్ టీచర్ (సిఆర్ టి) గా గుర్తించాలని, సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేస్తూ 2022 పిఆర్‌సి ప్రకారం తక్షణమే జీతాలు పెంచాలని, 2024 డిఎస్‌సిలో గురుకులంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ పోస్టులను మినహాయించాలని డిమాండ్‌తో నిరసన దీక్షలు రెండు వారాలుగా కొనసాగిస్తున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి

అవుట్ సోర్సింగ్ పనిచేస్తున్న తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలి. ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో గిరిజన విద్యార్థులకు 24 గంటలు విద్యాబోధన చేస్తున్నాం. తమ పోస్టులను డిఎస్‌సి నుంచి మినహాయింపు ఇవ్వాలి. రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటు పూర్తిస్థాయిలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ సర్వీస్ పరంగా వేతనాల చెల్లింపులోనూ వివక్షకు గురౌతున్నాము.

జె.రామకష్ణ,
రాష్ట్ర యూనియన్ సెక్రటరీ

సమాన పనికి సమాన వేతనం

విద్యార్థులకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేస్తున్న గురుకుల విద్యాసంస్థల ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి. గురుకుల ఉపాధ్యాయుల కష్టానికి తగిన గుర్తింపు లభించక పోవడమే కాకుండా వారిపై పని ఒత్తిడి, వేధింపులు పెరగాయి. సమస్యల్ని పరిష్కరించకపోతే ఆందోళనను మరింత ఉధృతంగా చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాం.

జీవన్ కృష్ణ
ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఉద్యోగ భద్రత కల్పించాలి

గురుకుల పాఠశాలలు, కలశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి. అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను సిఆర్ టిలుగా మార్చాలి. గురుకులాల్లో ఖాళీలను డిఎస్ సి నుంచి మినహాయించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు స్పందించకపోవడం విచారకరం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గురుకులాల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి.

పి.అప్పలనర్స
సిపిఎం జిల్లా కార్యదర్శి

సుబ్బారెడ్డికి ఘన నివాళి

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు, నాటక రచయిత, దర్శకుడు, ప్రజా కళాకారుడు గాదె సుబ్బారెడ్డి మరణం తీరని లోటని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ సభ్యులు టి.జోషి, కొగేశ్వరావు అన్నారు. ఆదివారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో గాదే సుబ్బారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సారా వ్యతిరేక కళాజాత ఉద్యమం ,అక్షరాస్యత కళాజాత పుచ్చలపల్లి సుందరయ్య చరిత్ర కళారూపకం, మహాకవి శ్రీశ్రీ సత జయంతి ఉత్సవాలు, వేమన విజ్ఞాన జాత వంటి ముఖ్యమైన కళాజాతాలు గాదె సుబ్బారెడ్డి పర్యవేక్షణలోనే రాష్ట్ర నలుమూలలు ప్రచారం జరిగిందన్నారు. ప్రజానాట్యమండలిని ఆంధ్ర రాష్ట్రంలో అభివృద్ధి చేయడంలో సుబ్బారెడ్డి కీలక పాత్ర పోషించారని కొనియాడారు.


సుబ్బారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

మహా ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు :ఈనెల 4న పాడేరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహా ధర్నాకు ఆదివాసి గిరిజనులు ఏకమై విజయవంతం చేయాలని సిపిఎం నేత, మండల వైస్ ఎంపిపి 1 పాటుబోయి సత్యనారాయణ, ఎంఎం శ్రీనులు కోరారు. మండలంలోని కించాయిపుట్ గ్రామపంచాయతీ పరిధిలోని గడ్డి బంధం, దారాపల్లి, సిరగంపుట్టు వరకు గుమ్మి గ్రామాలలో ఆదివారం పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పివిటిజీ తెగ ఆదివాసుల ఇల్లు నిర్మాణానికి రూ,5 లక్షలు మంజూరు చేయాలని, కాఫీ రైతుల బకాయి సొమ్ము చెల్లించి, గిట్టుబాటు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. జీఓ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని,ఆదివాసీ మాతృ భాష విద్య వాలంటీర్ లను, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగస్థులను రెగ్యులర్ చేయాలన్నారు. స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ 26 వేలు ఇవ్వాలని, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేసి వడ్డీలేని రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 4,5 తేదీలల్లో పాడేరులో నిర్వహించే సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ ప్రథమ మహా సభ సందర్భంగా డిసెంబర్ 4 న నిర్వహించే బహిరంగ సభకు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిలో నారాయణ, గొల్లోరి రమూర్తి, సుఖదేవ్, దళపతి, గణపతి , సాదురం, కృష్ణ, భాస్కర్, ప్రసాద్ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

గిరిజనులకు ఊట నీరే గతి!

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలోని లుంగుపర్తి పంచాయతీ పరిధి మల్లెపాడు గ్రామంలో దాహం కేకలతో గిరిజనులు అలమటిస్తున్నారు. కనీసం బోరు, పైపులైన్ వంటి పథకాలు నోచక అక్కడ గిరిజన ప్రజలు కలుషితమైన ఊట గెడ్డ నీటిని ఆశ్రయించవలసిన పరిస్థితి నెలకొంది. ఆ గ్రామంలో సుమారు 20 కుటుంబాల పైనా జీవనం సాగిస్తున్నాయి. తాగునీటి, రోడ్డు వంటి సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పైపులైన్ మరమ్మతుకు గురి కావడంతో ఏళ్ల తరబడి తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎటువంటి గత్యంతరం లేక గ్రామానికి సమీపంలో కొండపై నుండి వచ్చే ఊట నీటిని ఒడిసి పట్టుకొని తాగవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. కలుషితమైన ఈ నీటిని తాగడంతో అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ు గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాని గిరిజనులు కోరారు.

నేరాలు ఘోరాలు


చిలకమ్మ, నానిల మృతదేహాలు

అటవీ శాఖ క్వార్టర్స్‌లో విషాదం

- అనుమానాస్పదంగా ఇద్దరు మృతి

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అల్లూరి జిల్లా అరకులోయ మండలం కేంద్రంలోని పాత పోస్ట్ ఆఫీస్ సమీపంలో అటవీ శాఖకు చెందిన క్వార్టర్స్ లో విషాదం చోటుచేసుకుంది. డుంబ్రిగూడ మండలం సొవ్వ పంచాయితీ సొండింగివలస గ్రామానికి చెందిన కొర్ర చిలకమ్మా కుటుంబం గత ఎనిమిది ఏళ్లుగా నివాసం ఉంటుంది. వీరి కుటుంబం స్థానికంగా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శనివారం కూలి పనులు ముగించుకొని ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో భోజనాలు ముగించుకుని రాత్రి నిద్ర పోగా మరో గదిలో చిలకమ్మ, (55) , మనవడు నాని (7) రాత్రి నిద్ర పోయారు. ఉదయం కుటుంబ సభ్యులు నానమ్మ మనవడిని లేపేందుకు ప్రయత్నించగా వారు విగతజీవులై పడి ఉన్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.రాత్రి సంపూర్ణ ఆరోగ్యంతో నిద్రపోయిన నానమ్మ మనవడు ఉదయాన్నే విగత జీవులై కనిపించడం కుటుంబ సభ్యులను విషాద సంఘటన గురి చేసింది. వీరి మృతి చెందడానికి రాత్రి చలి నుండి ఉపశమనం కోసం కుంపటి పెట్టుకోగా ఆ కుంపటి పొగ వలన ఊపిరాడక మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులకు కుటుంబ సభ్యులు సమాచారం అందించడంతో విచారణ దర్యాప్తు చేపట్టారు.

275 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-పెదబయలు:మండలంలో పర్రెడ జంక్షన్ బస్సు స్టాఫ్‌లో 275 కేజీల గంజాయి పట్టుకొన్నట్లు స్థానిక ఎస్ఐ రమణ ఆదివారం విలేకరులకు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నవంబర్ 30న ఉదయం పెదబయలు పోలీస్ స్టేషన్ ఎస్ఐ .రమణ ఇచ్చిన ముందస్తు సమాచారం మేరకు పర్రెడ జంక్షన్ వద్ద పోలీస్ సిబ్బంది వాహనముల తనిఖీ చేస్తుండగా రెండు ఆటోలు, బైక్ పైన వెళు తున్న ముగ్గురితో పాటు 275 కేజీల గంజాయిని పట్టు కున్నామన్నారు. కేసు నమోదు చేసి రిమాండు నిమిత్తం కోర్టుకు పంపడమైందని తెలిపారు.

తుపానుతో రైతుల్లో గుబులు

ప్రజాశక్తి- అనంతగిరి:మూడు రోజులుగా తుపానుతో కురుస్తున్న వర్షానికి వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయి.ఈ తుపాను తాకిడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత నెల 29 తేదీన మొదలైన ఈ తుఫాన్ మూడు రోజులుగా ఏకధాటిగా రాత్రి పగలు ఎడతెరిపి లేకుండా కుండపోత వాన కురుస్తుంది. రాత్రి పగలు పొగ మంచు కమ్మేస్తుంది. దీంతో స్థానిక ప్రజలు అత్యవసర పనుల నిమ్మిత్తం బయటకు అడుగు వేసి అడుగు తియ్యలేని పరిస్థితితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చేతికి అంది వచ్చిన వ్యవసాయ పంటలు పప్పు దినుసులు కోత మొదలుపెట్టి నూర్పులు చేసే తరుణంలో తుఫాను ఒక్కసారిగా అతలాకుతలం చేయడంతో ఎక్కడి పంటలు అక్కడే కలాల్లో వదిలేసి వేసిన పరిస్థితి నెలకొంది. మరో రెండు మూడు రోజులు వర్షాలు కురిసినట్లయితే పంటలంతా మొలకలు ఎత్తి పాడైపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముందుగా కోతలు చేపట్టిన రైతులు ఎంతో కొంత పంటను ఇంటికి చేర్చారు. కొంతమంది రైతులు కోతలు, నూర్పులు ముమ్మరం చేపడుతున్న తరుణంలో తుఫాన్‌తో ఎక్కడి పంట అక్కడూ టార్పాలిన్ కప్పి వదిలి వేశారు.ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి పిఎల్‌జిఏ వారోత్సవాలు

అప్రమత్తమైన పోలీసులు : ఎఒబిలో విస్తృత తనిఖీలు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-సీలేరు : మావోయిస్టు పార్టీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పిఎల్‌జిఎ) వారోత్సవాలు ఈ నెల 2 నుంచి 8 వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల నుంచి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎఒబి సరిహద్దుల్లో పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దుల్లో మావోయిస్టులు ప్రాబల్యం తగ్గినప్పటికీ వారోత్సవాలు ఎక్కడా నిర్వహించకుండా కట్టడి చేసేందుకు పోలీసులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. ఎఒబి సరిహద్దు వారపు సంతల్లో పోలీసులు తనిఖీలు చేస్తూ అనుమానితులను ప్రశ్నించి విడిచిపెడుతున్నారు. కొంతకాలంగా చత్తీస్‌ఘడ్ రాష్ట్ర సరిహద్దుల్లో వేల సంఖ్యల్లో కేంద్ర బలగాలను మోహరించి సుమారు 90 మందికి పైగా మావోయిస్టులను హతమార్చి పోలీసులు పైచేయి సాధించారు. మావోయిస్టులకు పెద్ద ఎదురు దెబ్బ తగిలిన నేపథ్యంలో పోలీసులే లక్ష్యంగా చేసుకొని దాడులకు పూనుకోవచ్చని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దీంతో మరింత అప్రమత్తమైన పోలీసులు మావోయిస్టు సానుభూతిపరులపై ప్రత్యేక దృష్టి సారించి నిఘా పెట్టి ఆరా తీస్తున్నారు. దీంతో ఆంధ్ర ఒడిశా సరిహద్దు గిరిజనుల్లో తీవ్ర భయాందోళన నెలకొంది.

సీలేరు, దారకొండ, సప్పర్లలో తనిఖీలు

జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, సప్పర్ల పరిసర ప్రాంతాల్లో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. సీలేరు ఐటిఐ జంక్షన్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా ఎస్ఐ కే.రవీంద్ర శనివారం అనుమానతుల్ని నిలిపివేసి బ్యాగులు తనిఖీచేసి వారి వివరాలు సేకరించి విడిచిపెట్టారు. సీలేరు ముఖ్య కూడళ్లలో సిఆర్‌పిఎఫ్ బలగాలను మోహరించి ఆంధ్ర ఒడిశా సరిహద్దుల నుంచి వచ్చే పోయే వాహనాలని తనిఖీ చేశారు. దారకొండలో ఎస్ఐ రవీంద్ర యువకులతో సమావేశమయ్యారు. సంఘ విద్రోహ శక్తులకు ఎవరూ సహకరించరాదని, మావోయిస్టులకు గ్రామాల్లో ఆశ్రయం కల్పించొద్దని సూచించారు.

ప్రజాప్రతిధులకు నోటీసులు

పిజిఎల్‌ఆర్ వారోత్సవాలు ముగిసే వరకు ప్రజా ప్రతినిధులు ఊరు విడిచి వెళ్లేటప్పుడు తమకు సమాచారం తెలియజేసి వెళ్లాలని ఆదేశించి పోలీసులు నోటీసులు జారీ చేశారు.

నైట్ సర్వీస్ బస్సులు రద్దు

విశాఖ నుండి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులతో పాటు సీలేరు నైట్ హార్ట్ బస్సులను ఈ నెల 2 నుండి 8వ తేదీ వరకు పోలీసు ఉన్నతాధికారి ఆదేశాలు మేరకు రద్దు చేసినట్లు ఎస్సై రవీంద్ర తెలిపారు. కేవలం పగటిపూట తిరిగే ఆర్టీసి బస్సు సర్వీసులు మాత్రమే తిరుగుతాయని, ప్రయాణికులు దీనిని గమనించాలని కోరారు.


ఆంధ్రా ఒడిశా సరిహద్దులో కూంబింగ్‌తో జల్లెడ పడుతున్న పోలీసులు

రుషికొండ భవనాలను సద్వినియోగం చేయండి

రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు


రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు

ప్రజాశక్తి- సీతమ్మధార : వందల కోట్ల ప్రజాధనంతో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రుషికొండ ప్యాలెస్ భవనాలను సద్వినియోగపరిచే చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కమిటీని ఏర్పాటుచేసి, వారి సూచనలను స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆ భవనాలను అలాగే నిరుపయోగంగా వదిలేయడం వల్ల నిర్వహణ వ్యయం భారమవ్వడమే కాకుండా పాడయ్యే ప్రమాదం ఉందని, తద్వారా లాభం కంటే నష్టమే ఎక్కువని అభిప్రాయపడ్డారు.

ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నరవ ప్రకాశరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఆచార్య బాలమోహనదాస్, సామాజికవేత్త సన్ మూర్తి, శివశంకర్, ఆచార్య ముత్యాలరావు వింటాక్ ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రుషికొండ ప్యాలెస్ ఖర్చుల భారం ప్రభుత్వంపై పడకుండా విడివిడిగా ఆయా భవంతులను వివిధ కార్యక్రమాలకు కేటాయించాలని సూచించారు. సామాజిక విశ్లేషకులు సన్ మూర్తి మాట్లాడుతూ ఒకటి రెండు భవనాలను టూరిజం వసతిగృహంగా, మరో రెండు భవనాలను చిత్ర పరిశ్రమ షూటింగులకు, ఇంకో రెండు భవనాలను పురావస్తు భద్రతా కేంద్రాలుగా తీర్చిదిద్దాలని, మిగిలిన మరో భవనాన్ని విఐపిలకు అతిథి కేంద్రంగా మార్చాలని సూచించారు. రుషికొండ భవనాలను మ్యూజియంగా మార్చాలని వివిధ బౌద్ధ సంఘాల ప్రతినిధులు వెంకటరమణ, కస్తూరి ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జయశ్రీ, హుస్సేన్, హ్యూమన్ రైట్స్ శ్యాంప్రసాద్, డాక్టర్ బాబ్జి, శీతల్, చిన్నారావు, మేడా మస్తాన్ రెడ్డి, తెలుగు భాష ప్రతినిధి మూర్తి పాల్గొన్నారు. రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల అభిప్రాయాలు, నిర్ణయాలను ప్రభుత్వానికి పంపుతామని కన్వీనర్ నరవ ప్రకాశరావు వెల్లడించారు.

విశాఖ డెయిరీని ప్రభుత్వమే నిర్వహించాలి


విశాఖ డెయిరీ వద్ద దీక్షల్లో మాట్లాడుతున్న సిఐటియు నేత రమణ

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీని ప్రభుత్వ ఆధీనంలోనే నడవాలని, విశాఖ కోఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ డిమాండ్ చేశారు.

కొనసాగిన కార్మికుల దీక్షలు

కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ, యూనియన్ ఆధ్వర్యంలో నిరవధిక రిలే నిరాహార దీక్షలు ఆదివారం కొనసాగాయి. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, డెయిరీలో విధులు నిర్వహించరాదన్నారు. ఎనిమిది గంటల పనిదినం అమలుతో పాటు, అదనపు గంటల పనికి ఒటి ఇవ్వాలని, మహిళలకు ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు.. కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, పని ప్రదేశాల్లో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కోరారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే ఆందోళన ఉధృతం చేస్తానని,. దీనికి యాజమాన్యానిదే పూర్తి బాధ్యత అని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ నారాయణ, సంతోష్, వెంకటరమణ, గవర వెంకటరమణ, శంకరరావు పాల్గొన్నారు.

మహాకవి 'గురజాడ'కు ఐద్వా ఘన నివాళి


గురజాడకు నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక జోన్, షీలానగర్ ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు వర్ధంతిని షీలానగర్‌లో నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ఐద్వా నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి మాట్లాడుతూ, మహాకవి గురజాడ అప్పారావు జీవితం తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు..వరకట్న వేధింపులు, బాల్యవివాహాలకు ప్రతిఒక్కరూ తోడ్పడాలని, బాగాచదువుకొని, సమాజ మార్పుకు తోడ్పాటునందించడం ద్వారా గురజాడ అప్పారావు ఆశయసాధనకు కృషి చేద్దామన్నారు కార్యక్రమంలో ఐద్వానేతలు జి.మణి, ఎస్.నాగవేణి, డి శ్రీదేవి, బేబీ, మానస, సునీత, లక్ష్మి పాల్గొన్నారు..

మాధవధార : గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం కంచరపాలెంలో బొట్టా నర్సింగరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ పెంటకోట రామారావు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ముందుగా గురజాడ అప్పారావు చిత్రపటానికి కవులంతా పూలమాలలు వేసి నివాళు లర్పించారు.కార్యక్రమంలో ఆర్.తిరుపతిరావు, షణ్ముఖరావు, అడబాల సత్యనారాయణ, భాస్కరరావు, సానబోయిన అప్పలరాజు పాల్గొన్నారు.

విరబూసిన తురాయి పూలు


శ్వేతోడియా చెట్టు నిండా ఎరుపు వర్ణంలో విరబోసిన పువ్వులు

ప్రజాశక్తి-సీలేరు :జీకే వీధి మండలం సీలేరు ప్రధాన రహదారికి ఇరువైపులా, ఎపి జెన్కో కాలనీలో ఎరుపువర్ణంతో చెట్టు నిండా విరబూసిన తురాయి పూలు ఎంతో రమణీయంగా కనువిందు చేస్తున్నాయి. 2016లో సీలేరు అటవీశాఖ రేంజ్ అధికారిగా బేర్నాడ రాజు ఉన్న సమయంలో ఈ మొక్కలు నాటారు. ఎర్ర తురాయి పూలు శీతాకాలంలో మాత్రమే చెట్టు నిండా పూస్తాయి. ప్రస్తుతం స్థానిక పీహెచ్సీ సమీప ప్రధాన రహదారికి ఇరువైపులా చెట్లు నిండుగా పువ్వులు విరబూయడంతో ప్రకృతి ప్రేమికులు వాటిని ఆస్వాదిస్తున్నారు.

అలరించిన 'ఫ్రెండ్స్ కామెడీ క్లబ్' స్కిట్స్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ విశాఖ, హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించే 'వినోదాల విందు' కామెడి స్కిట్స్ ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ అధ్యక్షులు ఎంవి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనిర్వహించిన కార్యక్రమంలో ముందుగా ఇటీవల మరణించిన బాదంగీర్ సాయి ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం 'కుర్చీని వదలడం లేదు', 'అప్పడాల కర్ర'. 'సినిమా షూటింగ్', రంభ సూపర్ మార్కెట్', 'ధర్మం చెయ్యండి', 'సెల్‌ఫోన్ రిపేర్' తుమ్ముళ్లతో తంతా, వదిలిరాలేదా, డాక్టర్ పేషెంట్., పతియే దైవం, కాలు జారింది తదితర కామెడి స్కిట్స్, లఘునాటికలు అలరించాయి. కళాకారులు.ఎంవి. సుబ్రహ్మణ్యం.జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్‌రాజు, భాను.ప్రకాష్, నాయుడు, పోర్ట్ శేషు. ఇమంది ఈశ్వరరావు, రామానుజం, శివ జ్యోతిచ సీత, వెంకటేశ్వరరావు, పుష్యమి ప్రదర్శించిన స్కిట్లు కడుపుబ్బ నవ్వించాయి. అనంతరం కళాకారులకు తిలక్ పట్నాయక్. సన్ మూర్తి, వివి కృష్ణంరాజు తదితరులు మెమొంటోలతో సత్కరించారు.

విద్యుత్ ఛార్జీలు పెంచడం దుర్మార్గం


మాట్లాడుతున్న పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ప్రజాశక్తి- పెందుర్తి : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తుంగల్లో తొక్కి, విద్యుత్ ఛార్జీలను కూటమి ప్రభుత్వం పెంచడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే ఆదీప్‌రాజ్ అన్నారు. ఆదివారం రాంపురంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు అబద్ధాల మాటలు చెప్పి గెలవడం చంద్రబాబుకు అలవాటేనని అన్నారు. విద్యుత్ ఛార్జీలను పెంచేదిలేదంటూ మాటిచ్చి, ఇపుడు భారీ పెంపుతో వినియోగదారులను మోసపుచ్చారన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే రానున్న రోజుల్లో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. స్థానిక వైసిపినాయకులు పాల్గొన్నారు